సాక్షి
జగిత్యాల
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



శ్రావణమాస ఉత్సవాలు

జగిత్యాలరూరల్ : పొలాస శ్రీచక్ర సహిత లలితామాత ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



గోదావరిలో స్నానాలు

ధర్మపురి : గోదావరి నదిలో శుక్రవారం వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి నారాయణ

జగిత్యాలరూరల్: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి నారాయణ సూచించారు. శుక్రవారం కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, చిన్నచిన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గం ద్వారానే కేసులను పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్, న్యాయవాదులు చంద్రమోహన్, గంగప్రకాశ్, మురళీమనోహర్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ ఎక్కడా లేదు

- జగిత్యాల జిల్లా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణలో బీజేపీ ఎక్కడా లేదని, మూడో సారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే రోజుల్లో కాబోయే ఎమ్మెల్యే సంజయన్న అనే నినాదంతో పని చేయాలని కోరారు. గత ఎన్నికల్లో జగిత్యాల అడ్డాపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం చాలా సంతోషాన్నిచ్చిందని తెలిపారు. ఎమ్మెల్సీ రమణ సమన్వయంతో ఎమ్మెల్యే సంజయ్ తప్పకుండా మరోసారి భారీ మెజారిటీతో గెలుస్తారని అన్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయినవారి గురించి ఆలోచించవద్దని చెప్పారు. జగిత్యాల నియోజకవర్గంలో కేవలం కాంగ్రెస్‌తోనే బీఆర్ఎస్‌కు పోటీ ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిందేమీ లేదని కవిత విమర్శించారు.

పకడ్బందీగా పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

మల్లాపూర్(కోరుట్ల): గ్రామాల్లో ఓటర్ జాబితా పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో సవరణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అధికారులు బీఎల్వోల పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. సందేహాలను బీఎల్వోలు నివృత్తి చేయాలని సూచించారు. ఎన్నికల్లో ప్రతీపౌరుడు ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. 18 ఏళ్ల వయసు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐలు రాజేశ్, సురేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, శంకరమ్మ, బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానం రద్దు చేయాలి'



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు డిమాండ్ చేశారు. తపస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పింఛన్ విద్రోహ దినం పాటించారు. అనంతరం జగిత్యాల రూరల్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పింఛన్ భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని, జీవిత చరమాంకంలో అదే ఆధారమవుతుందని అన్నారు. నాయకులు ఒడ్నాల రాజశేఖర్, బోనగిరి దేవయ్య, శనిగరపు రాజేందర్, నాగమల్ల రమేశ్, కొండూరి రజినికాంత్, సురేందర్, రామకృష్ణ, తీగల శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

మూడు ముక్కలు.. ఆరు గ్యాంగులు

- రూ.లక్షలు కురిపిస్తున్న పేకాట స్థావరాలు • ముఠాల మధ్య ఆధిపత్యపోరు
- స్థానిక పోలీసులతో అందరికీ లింకులు
- వ్యతిరేకవర్గం 'ఆట' కట్టించేందుకు ఉప్పందిస్తున్న వైనం
- రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు • జిల్లావ్యాప్తంగా జోరుగా దాడులు

- మూడు నెలల క్రితం రాయికల్ మండలంలోని ఓ గ్రామంలో పేకాట ఆడుతున్న కొందరిని జగిత్యాల సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు.
- కోరుట్ల పట్టణ శివారులోని పేకాట స్థావరంపై వారం రోజుల క్రితం సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేశారు.
- నాలుగు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం మండలం గండిహనుమాన్ ఆలయ సమీపంలో పేకాడుతున్న వారిని పట్టుకుని రూ.74 వేలు స్వాధీనం చేసుకున్న సంఘటనలోనూ సీసీఎస్ పోలీసుల సమాచారం ఉందని తెలిసింది.
- పది రోజుల క్రితం కోరుట్ల వెటర్నరీ కళాశాల సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లారు. అలోగా పేకాటరాయుళ్లు అక్కడి నుంచి జారుకున్నారు.
- ఈ నాలుగు ఘటనలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. సీసీఎస్ పోలీసులు దాడులకు వెళ్లిన మూడు సందర్భాల్లోనూ పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. కానీ, స్థానిక పోలీసులు చేసిన ప్రయత్నమే విఫలం కావడం గమనార్హం. అయితే, కొందరు పోలీసులకు పేకాట గ్యాంగ్‌లతో ఉన్న సంబంధాలే ఇందుకు కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నియంత్రణకు చర్యలు

పేకాటరాయుళ్లను పట్టుకోవడంలో పోలీసు సిబ్బంది పక్కాగా పనిచేస్తున్నారు. పేకాటకు సంబంధించిన సమాచారం వచ్చిన వెంటనే స్పందించి పేకాటరాయుళ్లు, నిర్వాహకులను పట్టుకుంటున్నాం. మాకు వచ్చిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుంది.
– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

కోరుట్ల: జిల్లాలో మూడు ముక్కలాట ఆడిస్తూ రోజూ రూ.లక్షల్లో సంపాదించాలనే అత్యాశతో కొందరు గ్యాంగ్‌లుగా అవతారం ఎత్తారని, జోరుగా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారని సమాచారం. ప్రధానంగా ఇబ్రహీంపట్నం, రాయికల్, మల్లాపూర్ శివారుల్లోని గోదావరి నదీతీరం, ఆవలివైపున ఉన్న నిర్మల్, జగిత్యాల జిల్లాలోని అటవీ ప్రాంతాలను వీరు స్థావరాలుగా మార్చుకున్నారని తెలిసింది. కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి పరిసరాల్లోని మామిడితోటలనూ అడ్డాలుగా మార్చుకున్నారని సమాచారం. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పేకాట ఆడించే గ్యాంగ్‌లు రోజూ రూ.వెయ్యి వరకు కూలి చెల్లిస్తూ తమ వద్ద కొందరు వర్కర్లను నియమించుకుంటున్నారు. వీరు పేకాటస్థావరం పరిసరాల్లో నిఘా పెట్టి పేకాటరాయుళ్లకు అవసరమైన మందు, ఫుడ్ తెచ్చి ఇస్తుంటారు. పేకాట ఆడించే గ్యాంగ్‌లు సిట్టింగ్ ఫీజు కింద రోజూ రూ.50వేల వరకు జేబులో వేసుకుంటున్నట్లు సమాచారం.

సీసీఎస్ దాడులతో చెక్..

పేకాట గ్యాంగ్‌ల ఆధిపత్య పోరుతో ఎవరికివారు పైస్థాయి పోలీసు అధికారులకు సమాచారం అందిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో మూడు, నాలుగుచోట్ల సీసీఎస్ పోలీసులు పక్కా సమాచారం సేకరించి పేకాటస్థావరాలపై దాడులకు దిగి పేకాటరాయుళ్లను పట్టుకోవడం ఈ వాదనలకు ఊతమిస్తోంది. పేకాటరాయుళ్ల ఆట కట్టించడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సీసీఎస్ పోలీసులు చేస్తున్న వరుస దాడులతో వీలైనంత మేర పేకాటకు అడ్డుకట్టపడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆధిపత్య పోరు..

- ఒకేప్రాంతంలో పేకాట ఆడించే గ్యాంగ్‌లు ఆధిపత్యపోరుకు దిగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- తమ వద్ద పేకాట ఆడితే పూర్తి రక్షణ ఉంటుందని కొందరు నిర్వాహకులు బహిరంగంగానే ప్రచారం చేసుకుని మరీ పేకాటరాయుళ్లతో పేకాట ఆడిస్తున్నారు.
- కొన్నిచోట్ల తమ ఆధిపత్యం కాపాడుకోవడానికి కిందిస్థాయి పోలీసు సిబ్బందితో మరికొందరు సత్సంబంధాలు నెరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- ఇంకొందరు తమ ఏరియాల్లోనే పేకాట ఆడించే ఇతర గ్యాంగ్‌లను పోలీసులకు పట్టిస్తే తమ వద్ద గిరాకీ పెరుగుతుందన్న యోచనతో కింది స్థాయిలో కొందరు పోలీసు సిబ్బందితో టచ్‌లో ఉంటున్నట్లు సమాచారం.
- స్థానిక పోలీసులు పక్కా ప్లాన్‌తో పేకాటరాయుళ్లను పట్టుకునేందుకు స్థావరాల వద్దకు చేరుతున్నా.. ఆ సమాచారం లీక్ కావడంతో ఫలితం దక్కడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రాలో దొరికారు..!

కోరుట్ల: సంచలనం సృష్టించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి(24) అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటనలో నిందితులుగా భావిస్తున్న బంక చందన(21), ఆమె బాయ్‌ఫ్రెండ్‌ను పోలీసులు శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పరిసరాల్లో తలదాచుకున్న వీరిద్దరినీ పోలీసులు పట్టుకుని కోరుట్లకు తరలిస్తున్నట్లు తెలిసింది.

- దీప్తి మృతి కేసులో పురోగతి
- పోలీసుల అదుపులో చందన
- ఆమె బాయ్‌ఫ్రెండ్ కూడా..

మూడు రోజులుగా గాలింపు..!

- పట్టణానికి చెందిన బంక దీప్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే.
- అప్పటినుంచి ఆమె చెల్లెలు చందన పరారీలో ఉండటం కలకలం రేపిన క్రమంలో పోలీసులు ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు.
- అక్క దీప్తి చనిపోవడంలో తన ప్రమేయం లేదని చందన తన తమ్ముడు సాయికి వాయిస్ మేసేజ్ పంపిన క్రమంలో ఆమె సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.
- బుధ, గురువారాల్లో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు పోలీసు బృందాలు చందన ఆచూకీ కోసం హైదరాబాద్‌లో తీవ్రంగా గాలించాయి.
- అక్కడ నుంచి చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్ మకాం మార్చినట్లు గుర్తించినట్లు తెలిసింది. చందనతోపాటు ఆమె బాయ్‌ఫ్రెండ్‌కు పాస్‌పోర్ట్‌లు ఉండటం, వారు రూ.2 లక్షల నగదు, సుమారు రూ.90 లక్షల విలువైన బంగారం ఇంటి నుంచి తీసుకెళ్లారని తండ్రి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ఫిర్యాదు చేయడంతో ఆ డబ్బుతో వారిద్దరూ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందన్న అనుమానంతో పోలీసులు లుక్ అవుట్ నోటిసులు జారీచేశారు.



కోరుట్ల బస్టాండ్ సీసీ కెమెరాలో రికార్డయిన ఫుటేజీలో యువకుడితో చందన (ఫైల్)

హైదరాబాద్– బెంగళూర్ మార్గం.. ఆంధ్రాలో మకాం..!

బంక చందన బంధువులు ఒంగోలు జిల్లాకు చెందిన వారు కావడంతో ఆంధ్రప్రదేశ్‌కు ఆమె వెళ్లి ఉంటుందని భావించిన పోలీసులు.. ఆ దిశలో గాలింపు చేపట్టారు. హైదరాబాద్ నుంచి బెంగళూర్ మార్గంలోని అనంతపురం, ప్రకాశం జిల్లా పరిసరాల్లో చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్ ఉన్నట్లు గురువారం రాత్రి పోలీసులు గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున చందన ఆంధ్రాలోని ప్రకాశం జిల్లా పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించి పకడ్బందీ ప్రణాళికతో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి వారిద్దరినీ కోరుట్లకు తీసుకువచ్చినట్లుగా తెలుస్తోంది. పోలీసుల అదుపులో ఉన్న చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్ వాస్తవాలు వెల్లడిస్తే దీప్తి అనుమానాస్పద మృతి వెనుక అసలు నిజాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం విచారణ చేయనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ భూమిలో గుడిసెల వివాదం

- తిమ్మాపూర్ గ్రామస్తుల రాస్తారోకో
- అధికారుల జోక్యంతో ఆందోళన విరమణ



రాస్తారోకో చేస్తున్న తిమ్మాపూర్ గ్రామస్తులు

జగిత్యాలరూరల్: తిమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో పట్టణ పేదలు గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి యత్నాలను అధికారులు అడ్డుకుంటూ వస్తున్నారు. శుక్రవారం కూడా గుడిసెలు వేసేందుకు యత్నించారు. ఇదే సమయంలో తిమ్మాపూర్ దళితులు, గ్రామస్తులూ ఆందోళనకు దిగారు. తమ గ్రామంలోని ప్రభుత్వ భూములు తమకే కావాలని ఆందోళన చేశారు. పట్టణంలోని పేదలు మోతె రోడ్డులో ధర్నా చేయగా తిమ్మాపూర్ వాసులు జగిత్యాల–గొల్లపల్లి మెయిన్‌రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై సదాకర్, తహసీల్దార్ రాంమోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తిమ్మాపూర్ గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ భూమిలో ఎవరికి గుడిసెలు వేసేందుకు అనుమతివ్వమన్నారు. దీంతో గ్రామస్తులు శాంతించారు. నిరుపేదలు కూడా అనుమతులు లేకుండా గుడిసెలు వేస్తే చర్యలు చేపడతామని హెచ్చరించడంతో వారు శాంతించి వెళ్లిపోయారు.

అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులపై కేసు

కాగా, తిమ్మాపూర్ గ్రామ శివారుల్లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ప్రవేశించి గుడిసెలు వేయడానికి ప్రయత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. సర్వే నంబరు 363లో ప్రభుత్వ భూమి ఉందని, అందులో తిమ్మాపూర్ గ్రామ ఐకేపీ కేంద్రం, పల్లె ప్రకృతివనానికి కొంత స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. దీనితోపాటు జగిత్యాల మున్సిపల్ డంపింగ్ యార్డుకు మరికొంత స్థలం కేటాయించారని తెలిపారు. ఆ స్థలంలో నాలుగు వందల మంది అక్రమంగా ప్రవేశించి, అందులోని చెట్లకొట్టి వేసి గుడిసెలు వేయడానికి ప్రయత్నించారని వివరించారు. దీనిపై జగిత్యాల రూరల్ తహసీల్దార్ రాంమోహన్ ఫిర్యాదు మేరకు గర్వందుల రమేశ్, మెల్లాల బాలకృష్ణ, ఇందూరి సులోచన, కుంచెపు శంకర్, అరుణ్, తిరుపతినాయక్, నాగరాజుతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పల్లెలకు పచ్చదనం కళ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర, హాజరైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు

- అదనపు కలెక్టర్ దివాకర
- అనుభవాలు వెల్లడించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు
- జిల్లాలో ముగిసిన నాలుగురోజుల శిక్షణ కార్యక్రమం

జగిత్యాల: జిల్లాలోని పల్లెలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయని శిక్షణ ముగించుకున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్(సెంట్రల్ టీం) అదనపు కలెక్టర్ దివాకరకు వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ, గ్రామపంచాయతీల పాలన ఆదర్శనీయమన్నారు. గ్రామీణాభివృద్ధి, పల్లెప్రగతి, విలేజ్ శానిటేషన్, హరితహారం, ఉద్యానవనం, రెవెన్యూ సంబంధిత అంశాలు, మహిళా సంఘాల పనితీరు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ఇంకుడుగుంతల నిర్మాణం, దళితబంధు, కేసీఆర్ కిట్, కార్పొరేట్‌స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ రంగ ప్రగతి, ఈ ప్రాంత సంప్రదాయాలు ఆకర్షించాయని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు తెలిపారు. సంబంధిత మండల అధికారులు, సర్పంచులు వారి సమన్వయంతో నాలుగు రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నామని చెప్పారు. ఈ శిక్షణ తమకు ఎంతో ఉత్సాహం ఇచ్చిందని అదనపు కలెక్టర్‌తో వారు వివరించారు. అనంతరం ఢిల్లీకి తిరుగు పయనమయ్యారు.

మహిళా సాధికారత కోసమే పథకాలు



పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

జగిత్యాలరూరల్: మహిళా సాధికారత కోసమే ప్రభుత్వం పథకాలు ప్రవేశపెడుతోందని సెర్ప్ అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి శ్రీకార్ సుధీర్ అన్నారు. వీవోఏలకు వేతనాలు పెంచడంపై స్థానిక జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో వీవోఏలు శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ మహిళల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గ్రామైక్య సంఘాల అసిస్టెంట్లకు రూ.5 వేలు, గ్రామ సంఘాల ద్వారా రూ.3 వేలు, మొత్తం రూ.8 వేల వేతనం పెంచారని అన్నారు. వీరికి డ్రెస్‌కోడ్ కూడా అమలు చేస్తున్నారన్నారని, జీవిత బీమా సౌకర్యం కల్పించడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాణిక్‌రెడ్డి, వెంకటేశం, మల్లేశం, వనజ, ఏపీఎంలు వోదెల గంగాధర్, దాసు, తిరుపతి, నారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్ నేరం

- 12మంది తల్లిదండ్రులపై కేసులు
- 8నెలల్లో 5,432 ఇ – చలాన్లు
- ఎస్పీ భాస్కర్ వెల్లడి



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టప్రకారం నేరమని ఎస్పీ భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత 8 నెలల్లో మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ముగ్గురు మైనర్లు సెల్ఫ్ యాక్సిడెంట్‌తో డివైడర్లను ఢీకొని మృతి చెందారని అన్నారు. మైనర్ల డ్రైవింగ్‌లో 16వేల మంది వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని, దీనిని దృష్టిలో ఉంచుకుని మైనర్ల డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 12 మంది తల్లిదండ్రులపై కేసులు నమోదు చేశామని, 5432 మందిపై ఇ – చలాలాన్ కేసులు నమోదు చేశామన్నారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమేనని, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనాలు ఇచ్చి వారిని ప్రోత్సహించొద్దని తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

నేరం చేస్తే శిక్ష తప్పదు

నేరం చేసిన వారెవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ అన్నారు. ఆస్తి కోసం భర్తను హత్య చేసిన కేసులో శుక్రవారం ఇద్దరికి కోర్టు జీవిత ఖైదు విధించిందని తెలిపారు. అప్పు ఇవ్వనందుకు స్నేహితుడిని హత్య చేసిన కేసులో గత సోమవారం ముగ్గురికి జీవితఖైదు విధించారని గుర్తుచేశారు. గత ఎనిమిది నెలల్లో 10 హత్య కేసుల్లో 16 మందికి జీవితఖైదు, జరిమానా విధించారని పేర్కొన్నారు.

'జీవనజ్యోతి'.. ఆస్తులు జాస్తి!

- ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్య ప్రాపర్టీ విలువ రూ.60 కోట్లు
- వాటా క్లెయిమ్ చేసుకోని పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల సమాఖ్యలు
- పేరుకుపోయిన రూ.2 కోట్ల ఆస్తిపన్ను
- నోటీసులు జారీచేసిన ఐటీ శాఖ
- ఆగస్టు 31తో ముగిసిన గడువు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహిళా సమాఖ్యకు సంబంధించి ఓ ఆసక్తికర విషయం ఇపుడు తెరమీదకు వచ్చింది. ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్యకు సంబంధించి ఇంకా కొన్నిఆస్తులు విభజనకు నోచుకోలేదని, వాటి విలువ దాదాపు రూ.60 కోట్ల వరకు ఉంటుందన్నది దాని సారాంశం. విశ్వసనీయ సమాచారం ప్రకారం .. పాత మహిళా సమాఖ్య ఆస్తులకు సంబంధించి దాదాపు రూ.2 కోట్ల ఆస్తి పన్నులు కట్టాలంటూ ఇటీవల ఐటీశాఖ నుంచి నోటీసులు వచ్చాయి. ఆగస్టు 31లోగా మొత్తాన్ని చెల్లించాలని గడువు కూడా విధించినట్లు సమాచారం. అది కట్టని పక్షంలో రూ.1.80 లక్షల చొప్పున జరిమానా కూడా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి సమాఖ్యకు సంబంధించిన అవిభాజ్య ఆస్తులపై మరోసారి చర్చ మొదలైంది.

రెండు దశాబ్దాల కింద మొదలై..!

2000వ దశకం ఆరంభంలో గ్రామీణ మహిళల్లో పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాల(సెల్ఫ్ హెల్ప్ గ్రూపు/ఎస్‌హెచ్‌జీ)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతీగ్రామంలో 10 నుంచి 15 మంది మహిళలతో ఒక స్వయం సహాయ సంఘం ఏర్పాటు చేశారు. ఇలాంటి 20 నుంచి 30 గ్రూపులను కలిపి గ్రామైక్య సంఘం లేదా విలేజ్ ఆర్గనైజేషన్/వీవోగా పిలుస్తారు. వీటికి ప్రతినిధులుగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు ఉంటారు. వీవోలను కలిపి మండల స్థాయిలో మండల మహిళా సమాఖ్య, వీటిని కలిపి జిల్లాస్థాయిలో జిల్లా సమాఖ్యగా పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలో అప్పటి జిల్లా సమాఖ్యను జీవన జ్యోతి పేరుతో పిలిచేవారు. ఇవన్నీ సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(ఎస్ఈఆర్‌పీ లేదా సెర్ప్)కు అనుబంధంగా పనిచేస్తాయి. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని సమాఖ్యల్లో కరీంనగర్ సమాఖ్య కూడా ఆర్థికంగా బలంగా ఉండేది. మొదట్లో ఈ సమాఖ్యకు ఆర్థికంగా ప్రభుత్వం కూడా చేయూతనందించింది. ఇందుకోసం ఆరంభంలో కొంత గ్రాంటు ఇచ్చింది. తరువాత ఐకేపీ సెంటర్ల ద్వారా సేకరించిన ధాన్యం నుంచి క్వింటాలుకు రూ.32 కమీషన్ ఇచ్చేవారు. ఈ కమీషన్ పాత జిల్లా సమాఖ్య నుంచి మండల సమాఖ్య ద్వారా గ్రామైక్య సంఘాలకు చేరాలి. అదేవిధంగా కొందరు ప్రభుత్వశాఖలకు చెందిన ఉద్యోగులకు సైతం జిల్లా సమాఖ్య బ్యాంకు ఖాతా ద్వారా పంపిణీ చేసేవారు. అందుకు కూడా జిల్లా సమాఖ్యకు కమీషన్ సమకూరేది. అదేవిధంగా తిమ్మాపూర్ మండలంలో భారీగా గిడ్డంగులను నిర్మించి వాటిని సివిల్ సప్లై శాఖకు అద్దెకు ఇచ్చారు. వాటినుంచి నెలానెలా రూ.లక్షల్లో కిరాయి సమకూరుతోంది. క్రమంగా వీరి లావాదేవీలు పెరిగి లాభాలు మొదలవడంతో ఆదాయపు పన్ను శాఖ పరిధిలోకి వచ్చాయని అప్పట్లో ఆడిటర్ సూచించారు. దీంతో అప్పటి నుంచి పన్ను కూడా చెల్లించారని తెలిసింది. అయితే 2015–2016 సంవత్సరంలో ఆడిటింగ్ జరగలేదని సమాచారం.



విడిపోయాక పంపకాలు జరగలేదా?

2016 అక్టోబరులోనే పాత కరీంనగర్ జిల్లా కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల అనే నాలుగు కొత్త జిల్లాలుగా విడిపోయింది. అదే సమయంలో ×జీవన జ్యోతి×గా ఉన్న ఉమ్మడి జిల్లా సమాఖ్య దాని ఖాతాలు, ఆస్తులు, వాటి నిర్వహణ అలాగే కొనసాగుతోంది. అది అలా ఉండగానే కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో 'శ్రీ సీతారామ జిల్లా సమాఖ్య' ఆవిర్భవించింది. ఇదేబాటలో కొత్త జిల్లాలైన సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి కూడా తమ కొత్త సమాఖ్యలు ఏర్పాటు చేసుకున్నాయి. ధాన్యం సేకరణ పెరగడంతో అవికూడా ఆర్థికంగా సుస్థిరత సాధించుకుంటున్నాయి. అయితే, జిల్లాల విభజన జరిగి ఏడేళ్లు కావస్తుండటంతో పాత సమాఖ్య సంగతి దాదాపుగా అంతా మర్చిపోయారు. ఉమ్మడి జిల్లా సమాఖ్యకు సంబంధించిన నగదు, స్థిర ఆస్తుల విలువ రూ.60 కోట్ల పైమాటే ఉంటుంది. అయితే, పాత జిల్లా సమాఖ్య జీవనజ్యోతిలో తమ వాటా తేల్చలంటూ ఇప్పటివరకూ సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల సమాఖ్యల నుంచి ఎలాంటి వినతులు రాకపోవడం విడ్డూరంగా ఉంది. రూ.60కోట్ల ఆస్తుల్లో సమానంగా పంచుకుంటు ఎంతలేదన్నా.. జిల్లాకు రూ.15 కోట్లకు తక్కువ కాకుండా పంపకాలు జరగాలి. అలాంటి ప్రతిపాదన రాకపోవడం, పంపకాలు కాకపోవడం గమనార్హం. అయితే, ఇపుడు ఉమ్మడి జిల్లా సమాఖ్య ఖాతా ఎవరి అధీనంలో ఉంది? దాన్ని ఎవరు నిర్వహిస్తున్నారు? దానికి వస్తున్న బ్యాలెన్స్‌షీట్ ఎవరు చూస్తున్నారు? తదితర ప్రశ్నలకు డీఆర్‌డీవో అధికారులనే సమాధానాలు చెప్పాలి.

మాకెలాంటి సమాచారం లేదు

ఉమ్మడి కరీంనగర్ మహిళా సమాఖ్య ఆస్తుల పంపకంపై మాకు సమచారం లేదు. ఇప్పటివరకూ మా వాటా కావాలని లేదా తేల్చాలని కొత్త జిల్లాల సమాఖ్య నుంచి ఎలాంటి వినతి, ప్రతిపాదనలు రాలేదు. అదే సమయంలో ఉమ్మడి సమాఖ్య ఆస్తులు పంపకం చేపట్టాలని హైదరాబాద్, సెర్ప్ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు.
– శ్రీలత, డీఆర్‌డీవో, కరీంనగర్

క్లుప్తంగా

ప్రవేశాల గడువు పొడిగింపు

జగిత్యాల: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం గడువును ఈనెల 21వ తేదీ వరకు పొడించారని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ అనుమల్ల శ్యామ్ శుక్రవారం తెలిపారు. మహిళలు, బాలికలు, గ్రామీణ యువతకు విద్య అందించడమే తెలంగాణ ఓపెన్ స్కూల్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 98492 66786 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గూడ్స్ రైలు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

కోరుట్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం ఆనుకుని గూడ్స్ రైలు ఉంచడంతో ప్యాసింజర్ రైళ్లను చేరుకోవడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం 'సాక్షి రైలు ఎక్కేదెలా?' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో రైల్వే అధికారులు స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్లాట్‌ఫాంను ఆనుకుని ఉన్న గూడ్స్‌రైలును తొలగించారు. ప్రయాణికులు నేరుగా ప్యాసింజర్ రైళ్లు ఎక్కడానికి వీలు కల్పించారు.

రక్తకణాలు తగ్గి మృతి



అరవింద్(ఫైల్)

కోరుట్లరూరల్: అయిలాపూర్ గ్రామానికి చెందిన తమ్మెల అరవింద్ (23) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే లోపే చనిపోయాడు. రక్తకణాలు తగ్గడంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అరవింద్ తండ్రి రాజం గీతకార్మికుడు. ఈయనకు ఇద్దరు కుమారులు. అరవింద్ చిన్నకొడుకు. చేతికందిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఫిర్యాదు చేయడానికి వెనుకంజ?

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విదేశాలకు పంపిస్తానని చెప్పి నిరుద్యోగల నుంచి రూ.లక్షలు వసులు చేసి కనిపించకుండా పోవడంతో బాధితులు ఒకవైపు ఆందోళన చెందుతూనే.. మరోవైపు పోలీసులకు ఫిర్యాదు చేయడంలో తర్జనభర్జన పడుతున్నారు. సదరు వ్యక్తి ఇప్పటికే జర్మనీతోపాటు, యూరప్ దేశాలకు బతుకుదెరువు కోసం వెళ్లివచ్చాడు. ఆయా దేశాల్లో నెలకు రూ.5 లక్షల వరకు సంపాదించ వచ్చని యువకులను నమ్మించాడు. ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి రూ.లక్షలు వసూలు చేశాడు. ఉమ్మడి జిల్లా కరీంగనగర్‌జిల్లాతోపాటు, ఇతర జిల్లాలకు చెందిన వారినుంచి ఇలా సుమారు రూ.కోటికిపైగా ఆ వ్యక్తి వసూలు చేసినట్లు తెలిసింది. డబ్బులు తీసుకుని చాలారోజులుగా రేపు, మాపు విదేశాలకు పంపిస్తానని నిరుద్యోగులకు చెప్పి ఇప్పటి వరకు పంపలేదు. చాలారోజులు గడవడంతో తమను విదేశాలకు పంపిస్తావా? లేదా? అని బాధితులు ఏజెంట్‌పై ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో వారికి చెక్కులు ఇచ్చాడని, వాటిని తీసుకుని బ్యాంకుల్లోకి వెళ్తే కేవలం రూ.5 వేల బ్యాలెన్స్ మాత్రమే చూపించాయని చెబుతున్నారు. తల్లితండ్రులు కొల్వాయిలో ఉంటుండగా, సదరు ఏజెంటు హైదరాబాద్‌లో ఉండి ఏజెంటుగా వసూళ్లు చేశాడని చెబుతున్నారు. బాధితుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్లు పేర్కొంటున్నారు. శుక్రవారం విషయం పత్రికల్లో రావడంతో పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదులు వస్తాయని భావించారు. అయితే, ఫిర్యాదు చేయడానికి బాధితులు వెనుకాముందు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేస్తే కేవలం ఛీటింగ్ కేసు నమోదై కొన్ని రోజుల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చి మరింత స్వేచ్ఛగా ఉంటాడని పలువురు బాధితులు పేర్కొంటున్నారు.

కులవృత్తులకు చేయూత



చెక్కు అందిస్తున్న సంజయ్‌కుమార్

జగిత్యాల: బీసీ కులవృత్తులు, చేతివృత్తులకు చేయూత అందించడం కోసమే సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా పథకాలు ప్రవేశ పెడుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 92మందికి రూ.లక్ష ప్రోత్సాహకం అందజేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా 4,500 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించామని తెలిపారు. వైద్య కళాశాల సాధించుకున్నామని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందుతోందని అన్నారు. అనంతరం 16వ వార్డుకు చెందిన వికాస్‌యాదవ్‌కు రూ.28,500 విలువైన సీఎం సహాయ నిధి చెక్కు అందజేశారు. ఆర్డీవో నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

సహకార సంఘాల్లో 'మీసేవ'లు

- జిల్లాలో 50 కేంద్రాలు
- తొలగనున్న పల్లెవాసుల ఇబ్బందులు



భూషణరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లు ప్రస్తుతం రైతులకు రుణాలు మంజూరు చేయడం, విత్తనాలు, ఎరువులు, పురుగుల నివారణ మందులు విక్రయిస్తున్నాయి. మరికొన్ని పెట్రోల్, డీజిల్ బంక్‌లు నిర్వహిస్తున్నాయి. చాలా పీఏసీఎస్‌లు ధాన్యం కొనుగోలు చేస్తూ ఆర్థికంగా అధిక ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. ఇలా వివిధ వ్యాపారాలు చేస్తూ బలోపేతమవుతున్నాయి. వాటిని మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే సహకార సంఘాలను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చుకునేందుకు అనుమతి ఇచ్చింది.

జిల్లాలో 51 సహకార సంఘాలు..

- జిల్లాలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి.
- ఇందులో సుమారు లక్ష మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.
- కేంద్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చుతూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.
- కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు.
- జిల్లాలో 50 సహకార సంఘాలు కేడీసీసీ పరిధిలో ఉండగా.. సారంగాపూర్ మండలం కోనాపూర్ పీఏసీఎస్ మాత్రం ఎస్‌బీఐ పరిధిలో లావాదేవీలు నిర్వహిస్తోంది.
- దీనికి మాత్రమే 'మీ సేవ' ఏర్పాటుకు అనుమతి రాలేదు.
- మిగతా 50 సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సుమారు పదిరోజుల క్రితం శిక్షణ ఇచ్చారు.

గ్రామీణులకు మేలు..

పీఏసీఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చితే ప్రస్తుతం మీసేవా కేంద్రాల్లో అందించే సేవలన్నీ ప్రజలకు అందిచవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా 'మీ సేవ' కేంద్రాలు లేకపోవడంతో వివిధ పనుల కోసం రైతులు, విద్యార్థులు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు అధిక వ్యయ ప్రయాసల కోర్చి వెళ్తున్నారు. సహకార సంఘాల్లో 'మీ సేవ'లు అందుబాటులోకి రావడంతో ఆ తిప్పలు తప్పినట్లేనని అంటున్నారు. 'మీసేవ'లు అందుబాటులోకి వస్తే నిరుద్యోగులు, పింఛన్‌దారులు, ఉద్యోగులు, రైతులు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం చాలా దూరం వెళ్లాల్సిన అవసరం ఇక ఉండదు.

గ్రామీణులకు మరింత చేరువ



ఇన్నాళ్లూ కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం కథలాపూర్ వెళ్లాం. భూముల రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకోవాలన్నా అక్కడకే వెళ్లి నిరీక్షించాం. సహకార సంఘాల్లో 'మీ సేవ'లు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లోని రైతులు, విద్యార్థులు దూర ప్రాంతాలకు పోయే ఇబ్బందులు తొలిగిపోతాయి. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం అందరికీ మేలు చేస్తాయి.

– కొండ ఆంజనేయులు, ఎంపీటీసీ

ఏర్పాట్లు చేస్తున్నాం



సహకార సంఘాల్లో 'మీ సేవ'లు మాదిరిగా సేవలు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు శిక్షణ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లో 'మీ సేవ'లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలు వివిధ సర్టిఫికెట్లకు, ఆన్‌లైన్ సేవలకు సహకార సంఘాలను ఆశ్రయించొచ్చు.

– ఉశకోల అరుణ్, సీఈవో, పీఏసీఎస్, భూషణరావుపేట

ఆర్థికంగా బలోపేతం



జిల్లాలోని 50 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణులకు సేవలు మరింత చేరువ చేయొచ్చు. మరోవైపు సంఘాలకు అదనపు ఆదాయం సమకూరి ఆర్థికంగా బలోపేతమవుతాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– సత్యనారాయణరావు, సీఈవో, కేడీసీసీబీ, కరీంనగర్

అత్యాచార నిందితులను శిక్షించాలి

- తీవ్రమైన రక్తస్రావంతోనే బాలిక మృతి
- ఎలుకల మందు తాగిందని నమ్మించే ప్రయత్నం
- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

సాక్షి,పెద్దపల్లి: వలసకూలీపై అత్యాచారం చేసి మృతికి కారణమైన హంతకులను కఠినంగా శిక్షించాలని భారతకమ్యూనిటీ పార్టీ(మావోయిస్టు) జయశంకర్, మహబూబాబాద్, వరంగల్-2, పెద్దపల్లి(జెఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం పత్రికాప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పీడిత ప్రజలకు రక్షణలేకుండా పోయిందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు పొట్టకూటికోసం పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వెంచర్‌లో భవన కూలీలుగా పనిచేస్తున్నారని, వలసకూలీలతో ఒప్పందం చేసుకుని దళారులు ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారన్నారు. వీరిపై గతంలో అత్యాచారాలు జరిగాయన్నారు. రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో పనిచేస్తున్న బాలికను ఒక వ్యక్తి తన ఇంటిలో పనిఉందని మేస్త్రీకి చెప్పి తీసుకవెళ్లి మరోముగ్గురితో కలిసి నోటిలో గుడ్డలు కుక్కి సామూహిక అత్యాచారం చేసి పెద్దపల్లి బస్టాండ్‌లో వదిలివెళ్లారన్నారు. అప్పన్నపేట గ్రామానికి చెందిన వారు గుర్తించి రియల్ ఎస్టేట్ వద్దకు తీసుకెళ్లి అక్కాబావలకు అప్పగించారని, ఈవిషయాన్ని మేస్త్రీకి చెప్పగా ఎక్కడైనా చెబితే చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. తీవ్రరక్తస్రావం జరిగినప్పటికి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వాళ్లను బెదిరించి వాహనంలో ఎక్కించి మధ్యప్రదేశ్‌కు తరలించారన్నారు. ఈక్రమంలో మార్గమధ్యంలో మరణించిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు యాజమాన్యానికి అండగా ఉండటంతో ఏంచేసినా చెల్లుతుందని విర్రవీగుతూ ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు.

వేలాది సీసీ కెమెరాలు..

తెలంగాణలో ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే తెలిసేవిధంగా వేలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, సాధారణ వ్యక్తులు ఏం చేసినా అవి రికార్డు అవుతాయని, అదే పోలీసులు, అధికారులు, యంత్రాంగం, రాజకీయనాయకులు ఏంచేసినా అవి రికార్డు కావన్నారు. బాలికను బస్టాండ్‌లో పడేసిపోయిన సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదన్నారు. ఘటనను పక్కదారి పట్టించేందుకు అత్యాచారం చేసిన బాధితులు, మేస్త్రీ కూలీ కుటుంబాన్ని బెదిరించి మధ్యప్రదేశ్‌కు తరలిస్తుండగా తీవ్ర రక్తస్రావంతో బాలిక మార్గమధ్యంలో చనిపోయింది కానీ.. ఎలుకల మందు తాగి మృతి చెందిందని ప్రజలను నమ్మించాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వమే బాధ్యత వహించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇండియా కూటమితో బీజేపీకి భయం

- అందుకే జమిలి అంటూ కొత్తరాగం
- పొత్తులు ఎలా ఉన్నా ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: దేశానికి బీజేపీ పాలన నుంచి విముక్తి చేయడానికి ఇండియా కూటమి ఏర్పడిందని, అప్పటి నుంచి బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే జమిలి ఎన్నికలంటూ కొత్తరాగం పాడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో దేశంలో అస్థిరత ఏర్పడిందని అన్నారు. బీజేపీని గద్దెదించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న మెజార్టీ ప్రతిపక్షాలన్నీ కలిసి ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. దీంతో బీజేపీఈకి వణుకు పుట్టిందని, జమిలి ఎన్నికలు జరపాలని కొత్తరాగం తీయడం దానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ ఆధ్వర్యంలో కమిటీ వేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని నిలువరించడానికి మునుగోడులో బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చామని, ఈ మద్దతు ఇలాగే కొనసాగిస్తామని బహిరంగ సభలో స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పి ఇప్పుడు మాట మార్చాడని, మిత్రధర్మం మరిచాడని, అంతర్గతంగా బీజేపీతో దగ్గరవుతున్నాడని అనుమానం కలుగుతోందని అన్నారు. జాతీయ పార్టీ సూచన మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 11 నుంచి 17వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరపాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వివిధ జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, కర్రె భిక్షపతి, తాండ్ర సదానందం, గుంటి వేణు, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోనగంటి కేదారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



నిరాహార దీక్షలో మాజీ సర్పంచులు

జగిత్యాలటౌన్: రైదేళ్లపాటు ప్రజాసేవకే అంకితమై, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన మాజీ సర్పంచులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ నారాయణ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం సమీపంలో మాజీ సర్పంచుల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం కూడా కొనసాగింది. నారాయణ మాట్లాడుతూ, మాజీ సర్పంచులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రతినెలా రూ.పదివేల పింఛన్ చెల్లించాలని కోరారు. హెల్త్ కార్డు, పేద మాజీ సర్పంచులకు రెండెకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దమ్మని బాలముకుందం, రవీందర్‌రెడ్డి, రాధాకిషన్, కిషన్‌రెడ్డి ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు





గాయపడ్డ రాజన్న, వరలక్ష్మి

ధర్మపురి: ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు టైరు ధర్మపురి సమీపంలోని బుద్దేశ్‌పల్లె వద్ద పగలిపోయింది. దీంతో కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న జైనా గ్రామానికి చెందిన రాపెల్లి రాజయ్య, మచ్చ వరలక్ష్మికి గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలి

జగిత్యాలటౌన్: స్థానిక ఓల్డ్‌బస్టాండ్ పోలీస్ క్వార్టర్స్ స్థలంలో గతంలో ప్రతిపాదించిన మేరకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం డీజీపీకి ఆయన ఒక లేఖ రాశారు.

గుండెపోటుతో రైతు మృతి



గంగాధర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: తిప్పన్నపేట గ్రామానికి చెందిన రైతు కట్ట గంగాధర్ (50) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందాడు. గంగాధర్ ఉదయం 11 గంటల వరకు వ్యవసాయ పనులు చేశాడు. ఆ తర్వాత పని నిమిత్తం జగిత్యాలలోని బ్యాంక్‌కు వచ్చాడు. అక్కడ చెమటలు, చాతిలో నొప్పి రావడంతో వెంట ఉన్న స్నేహితుడు ద్విచక్ర వాహనంపై ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు వెల్లడించారు. మృతుడికి భార్య గంగవ్వతోపాటు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు బెంగళూరులో ఉండటంతో అతడి వచ్చిన తర్వాత శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మృతదేహం లభ్యం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని సాయిరాం కాలనీ శివారులో శుక్రవారం గుర్తుతెలి యని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ మృతదేహం ఉండడాన్ని గమనించిన కొందరు స్థానికులు కొందరు.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు వెళ్లిన పోలీసులు.. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి అక్కడే పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శ్యాంకుమార్ తెలిపారు.

అక్కాచెల్లెళ్లకు యావజ్జీవం

- చెల్లెలుతో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- మృతదేహానికి బండకట్టి బావిలో పడేసిన వైనం
- సంగెం ఘటనలో తీర్పు చెప్పిన కోర్టు

కోరుట్ల/జగిత్యాలక్రైం: ఆస్తి పంచి ఇవ్వడం లేదన్న నెపంతో భర్తను హత్య చేసిన భార్యకు, ఆమెకు సహకరించిన చెల్లెలుకు జగిత్యాల సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ శుక్రవారం యావజ్జీవ శిక్ష, రూ. 6వేల జరిమానా విధించినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2018 మార్చి 3వ తేదీన కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన గుంటి గంగమల్లయ్య(52) తన రెండో భార్య గుంటి దేవ(35)తో కలిసి పొలం వద్దకు వెళ్లి సాయంత్రం వరకూ రాలేదు. దీంతో అనుమానించి అతడి మొదటి భార్య కుమారుడు గుంటి మహేందర్ అప్పటి సీఐ సతీశ్‌చందర్‌రావుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన సీఐ.. మృతుడి రెండోభార్య గుంటి దేవతోపాటు కల్వకోటకు చెందిన ఆమె చెల్లెలు ఆదె రజితను నిందితులుగా గుర్తించారు. అనంతరం వారిని విచారించగా గుంటి దేవ తన చెల్లెలు రజితతో కలిసి పొలం పనుల ముగిసిన తర్వాత భర్త గుంటి గంగమల్లయ్యపై వెనుక నుంచి దాడి చేసి కత్తితో మెడ కోసి హత్య చేసినట్లు తేలింది. హత్య చేసిన తర్వాత గంగమల్లయ్య మృతదేహం నడుముకు చీరతో బండ కట్టి వ్యవసాయ బావిలో పడేశారు. ఆస్తి కోసమే హత్య చేసినట్లు ధ్రువీకరించిన అప్పటి కోరుట్ల సీఐ సతీశ్‌చందర్‌రావు.. 302, 201 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద వీరిని అరెస్టు చేయగా జగిత్యాల సెషన్స్ కోర్ట్‌లో విచారణ సాగింది. గుంటిదేవ, రజిత కలిసి గంగమల్లయ్యను హత్య చేసినట్లుగా సీఐ సతీశ్‌చందర్‌రావు, పీపీ మల్లి కార్జున్ కోర్టులో సరైన సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. దీంతో జగిత్యాల సెషన్స్ కోర్ట్ జడ్జి నీలిమ శుక్రవారం తుది తీర్పు వెల్లడించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, నిజాలు నిర్భయంగా కోర్టుకు వచ్చి చెపి తే నిందితులకు త్వరితగతిన శిక్షలు పడతాయన్నారు.

నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్'



మాట్లాడుతున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టామని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 63 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడారు. కొత్త వ్యక్తులు, నేరస్తుల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, లేదా డయల్ 100 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి ఎస్ఐలు ఉమసాగర్, నవీన్, శ్యామ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు ఎమ్మెల్యే భిక్షకాదు

- బీఆర్ఎస్ శ్రేణులకు ఇస్తామనడం సరికాదు
- అంబేడ్కర్ సంఘం నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న నాయకులు

మల్యాల(చొప్పదండి): బీఆర్ఎస్ పార్టీ అనుచరులకే దళితబంధు కేటాయిస్తామనడం ఎమ్మెల్యే దురహంకారానికి నిదర్శనమని అంబేడ్కర్ సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ దళితబంధు ప్రవేశ పెట్టారన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం గౌరవ అధ్యక్షుడు శనిగరపు తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ అనుచరులకే దళితబంధు మంజూరు చేసుకుంటామని ఎమ్మెల్యే రవిశంకర్ అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఎంతమంది దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగాయో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని ఎమ్మెల్యే రవిశంకర్‌ను కోరితే.. కేవలం తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇస్తామన్నారని, ఇది మీ పార్టీ నిధుల్లో నుంచి దళితులకు ఇవ్వడం లేదని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం దళిత జనాభాకు అనుగుణంగా కేటాయించిన షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధుల నుంచి ఇస్తున్నారని అన్నారు. అర్హులైన వారికి దళితబంధు నిరాకరించడం దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమేనని అన్నారు. అర్హులైన ప్రతీదళిత కుటుంబానికి పార్టీలకు అతీతంగా పథకం వర్తింపజేయాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యేను అడుగడుగునా ప్రజలు అడ్డుకుని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నలువాల సంజీవ్, మారంపల్లి గంగాధర్, నక్క అనిల్, మల్యాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన టీచర్లు, విద్యార్థులు, కుటుంబసభ్యులు

- 23 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు శుక్రవారం ఒకే వేదికపై కలసుకున్నారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరికి స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా మారింది. అప్పటిటీచర్లు, పూర్వవిద్యార్థులు కుటుంబసభ్యులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రసంగించారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట, పాటలతో సందడి చేశారు. సామూహికంగా భోజనాలు చేసి ఆటోగ్రాఫ్ తీసుకొని మళ్లీ కలుద్దాం మిత్రమా అంటూ సమావేశాన్ని ముగించేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి టీచర్లు ఏలేటి రాంరెడ్డి, వెంకటేశం, లచ్చన్న, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించేందుకే..



గోదావరి నదిలోని మట్టితో నాయకులు

ధర్మపురి: దేశభక్తికి ప్రతీక 'మేరా దేశ్ మేరా మాటి' కార్యక్రమమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం అన్నారు. అమృత్ మహోత్సవంలో భాగంగా ధర్మపురి పట్టణంలో శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్ ఆధ్వర్యంలో మేరా దేశ్‌మేరా మాటి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యం మాట్లాడుతూ .. ఇది పార్టీ కార్యక్రమం కాదని, దేశంలోని ప్రతీఒక్కరిలో దేశభక్తిని పెంపొందించడం కోసం చేపట్టిన గొప్ప కార్యక్రమన్నారు. ధర్మపురి నియోజకవర్గం కేంద్రంలో ప్రవహిస్తున్న గోదావరి నది దేశంలోనే రెండోదన్నారు. ఈసందర్భంగా గోదావరి నదిలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మట్టిని సేకరించి కలశంలో భద్రపర్చామని తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించి అందులో కొంచెం తీసి కలశంలో భద్రపరిచి ఢీల్లీకి తీసుకు వెళ్తామని చెప్పారు. ఇలాంటి పుణ్య కార్యక్రమం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు పిల్లి శ్రీనివాస్, చంద్రశేఖర్, గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.